# ఎల్‌జి పాలిమర్స్‌లో విషవాయు లీకేజి

# ప్రభుత్వాల, బహుళజాతి కంపెనీల ఘోర నిర్లక్ష్యఫలితమే

**మే** 7వ తేదీన విశాఖలో ఎల్జీ పాలిమర్స్ కంపెనీలో స్టైరీన్ గ్యాస్ తెల్లవారు జామున 3 గంటలకు లీకవ్వడంతో ఘోరమైన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కంపెనీకి ఆనుకొని వున్న ఆర్.ఆర్.వెంకటాపురం, వెంకటాద్రినగర్ గ్రామవాసులు ప్రమాదంలో తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, 14 మంది మరణించారు. అలాగే చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా తీవ్ర నష్టం జరిగింది. గర్భిణీ స్త్రీలకు అబార్షన్ అయ్యింది. దీన్ని ఆనుకొని నివాసం వుంటున్న 5-6 గ్రామాల్లో ఇళ్లల్లో వున్న సామానంతా నాశనం అయ్యింది. చెట్లు మాడిమసైపోయాయి. ఈ గ్రామాల్లో వున్న జంతువులు విలవిల్లాడుతూ చనిపోయాయి. ఈ గ్రామాల్లో ప్రజలు వందలాదిమంది ఆస్పత్రి పాలయ్యారు. ప్రాణాల నుంచి బయటపడినప్పటికీ నేటికీ వీరంతా చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారు. ఈ విషవాయువు కంపెనీ చుట్టుప్రక్కల వున్న 30-40 కిలోమీటర్ల వరకూ దుష్ప్రభావాన్ని కలిగించింది. వేలాదిమంది శ్వాస తీసుకోవటం 3 రోజుల వరకూ కష్టంగా మారింది. తెల్లవారుజామున 3 గంటలకు తమకు ఏం జరిగిందో, ఏం జరుగుతుందో తెలియక ఇళ్ల నుంచి బయటికి వచ్చినవారందరూ ఎక్కువ శాతం ఆక్సిజన్ అందక ఎక్కడవాళ్లు అక్కడే పడిపోవడం హృదయ విదారకంగా మారింది. తమకు ఏం జరిగిందో?!.... ఎందుకు పడిపోతున్నారో?!.. అర్థంకాని స్థితిలో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పదుల సంఖ్యలో ప్రజలు ఇళ్ళ నుండి బయటకు వచ్చి నడవలేక ఎక్కడబడితే అక్కడ పడిపోయారు. విశాఖ ప్రజలందరికీ త్రాగునీరందించే మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ నీరు కలుషితమయ్యిందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. పాలీమర్స్ గ్యాస్ లీకేజీతో కంపెనీ కార్మికుల మీద కంటే చుట్టుప్రక్కల ప్రజలే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో చనిపోయినవారికి కోటి రూపాయలు, ఆస్పత్రి పాలైన వారికి లక్ష రూపాయలు ప్రకటించి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది.

కరోనాతో షట్‌డౌన్ చేసిన కంపెనీ తిరిగి మే 5వ తేదీ నుంచి పని ప్రారంభించింది. ఫ్యాక్టరీని ప్రారంభించే ముందు యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏ మాత్రం తీసుకోలేదు. దీనికి కారణం నైపుణ్యం గల్గిన కార్మికులను నియమించకపోవటమే. దీనికి తోడు ఆపద సమయాల్లో మ్రోగవలసిన అలారం కనీసం మ్రోగలేదు. ప్రాథమిక వైద్యం లేదు. అంబులెన్స్ లేదు. కోట్లాది రూపాయలు లాభాలు గడిస్తున్న కంపెనీ తీసుకున్న ప్రాథమిక భద్రతా చర్యల పరిస్థితి ఇది.

1961లో హిందూస్థాన్ పాలిమర్స్ కంపెనీ ఏర్పాటు చేయటం జరిగింది. ఇది పాలీస్టైరీన్ ఉత్పత్తి చేసేది. ఈ కంపెనీ 1978లో యునైటెడ్ బ్రేవరీస్ మెల్ డోవెల్ కంపెనీలో విలీనమయ్యింది. ఈ కంపెనీలో ప్రధానంగా తయారయ్యేది ఆల్కహాల్. 1997లో ఈ కంపెనీని దక్షిణకొరియాకి చెందిన ఎల్‌జీ కెమికల్స్ స్వాధీనం చేసుకుంది. దక్షిణకొరియా కంపెనీ స్వాధీనం చేసుకున్న తర్వాత కొరియా, అమెరికాల నుంచి స్టైరీన్ రసాయనాన్ని దిగుమతి చేసుకుంటూ, దీని నుండి ఇంజనీరింగ్ ఉత్పత్తుల్ని, ప్లాస్టిక్, ఇతర పాలిమర్లను ఉత్పత్తి చేసే కంపెనీగా మారింది. మన దేశంలో ఒక బహుళజాతి కంపెనీ తన ఉత్పత్తి సామర్థ్యపు పెంపు మన చట్టాలతో ఏ మాత్రం ప్రమేయం లేకుండా జరిగిపోతున్నాయంటే మన పారిశ్రామిక విధానం బహుళజాతి కంపెనీల లాభార్జనలకోసం తప్ప మన దేశ అభివృద్ధి కోసం ఏ మాత్రం కాదని పదేపదే స్పష్టమవుతున్నది. మనలాంటి పేద దేశాలపై ప్రపంచీకరణ దుష్ఫలితాలు ఇవే.

బహుళజాతి కంపెనీగా మారిన ఈ కంపెనీ విస్తరణకు, ఉత్పత్తులకు మన దేశ చట్టాలేవి వర్తించలేదు. వీటన్నింటికంటే ముఖ్యమైనది కార్మికులు యూనియన్‌ని ఏర్పాటు చేసుకునే హక్కు లేకుండా చేసి, కార్మికుల హక్కుల గురించి, పర్యావరణాన్ని గురించి మాట్లాడే స్థితే లేకుండా పోయాయి. ఇది దేశంలో వున్న పొల్యూషన్ కంట్రోల్ చట్టాలకు లోబడి పనిచేసే కంపెనీ కాదు. ఇది కేవలం ఒక బహుళజాతి కంపెనీగా ప్రతి సం॥ కోట్లాది రూపాయలు లాభాలు గడించటమే దీని ప్రధాన ధ్యేయం. మన ప్రభుత్వాలు కార్మికుల హక్కుల గురించి, కార్మికుల భద్రత గురించి కనీసపు చర్యలను తీసుకోలేని దుస్థితికి చేరాయి. అంతే కాదు పర్యావరణాన్ని ధ్వంసం చేసి దేశ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్న ఈ కంపెనీ యాజమాన్యాన్ని ఏమి చేయలేని దుస్థితిలో వున్న మన "పరాయి" పాలకులు చేస్తున్న నిర్వాకం ఇదే. ప్రజలు కష్టాలు పడుతున్న సమయంలో రా మెటీరియల్‌ను, స్టైరీన్ గ్యాస్‌ని, పాలిమర్స్‌ని లారీల్లో తరలించుకుపోవటం మన ప్రభుత్వాధికారుల కనుసన్నల్లోనే

జరిగింది. పెద్ద పెద్ద కంపెనీలు పెట్టి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్న మాట ఎంత బూటకమో, ఈ కంపెనీ లీకేజీ నష్టాలను, పర్యావరణం వలన కలిగిన నష్టాలను, కార్మికుల దుస్థితి, ప్రజల దుస్థితి పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ విషయాన్ని మరింత లోతుగా పరిశీలిస్తే ఇంకా అనేక విషయాలు మనకు అర్థమవుతాయి. 14 మంది ప్రాణాలు పోవడానికి, వందలాదిమంది అనారోగ్యాల పాలవడానికి, గ్రామాలు కకావికలం కావడానికి కారణమైన కంపెనీపై చర్యలు తీసుకోవడం గానీ, యాజమాన్యాన్ని అరెస్టు చేయడంగానీ, కేసు పెట్టడంగానీ మన పాలకులు కనీసంగా చేయలేదు. ఇంతటితోటే ఆగకుండా పిల్లల్ని కోల్పోయిన తల్లులు, భర్తల్ని పోగొట్టుకున్న భార్యలు మీరు ప్రకటించే కోటి రూపాయలు మాకు వద్దు, చనిపోయిన మా కుటుంబసభ్యులే కావాలని ప్రశ్నించినందుకు కేసులు నమోదు చేయటం ఈ పాలకుల నైజం. ఇంతటి సంఘటనలో న్యాయ వ్యవస్థ ఏం చేస్తుంది? కార్మిక చట్టాలు ఏమైపోయినాయి? ప్రజాస్వామ్యంలో ఇవన్నీ ప్రశ్నలే. మన దేశంలో కార్మికుల కోసం, ప్రజల కోసం ఆలోచించే మేధావులు, ప్రజాస్వామికవాదులందరికీ ఇవన్నీ ప్రశ్నలుగానే మిగులుతాయి.

1984లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన గ్యాస్ లీకేజీతో బాధితులు ఈనాటికీ అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఈ దుర్ఘటనను మన దేశ ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరు. 1997లో విశాఖలో జరిగిన హెచ్‌పిసిఎల్ ప్రమాదం విశాఖ ప్రజలకు పీడకలగానే మిగిలిపోయింది. ఎల్‌జీ పాలిమర్స్, హెచ్‌పిసిఎల్ లాంటి కంపెనీలు పదుల సంఖ్యలో ప్రమాద ఘంటికలు మ్రోగిస్తూ విశాఖ ప్రజలను నిరంతరం భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇవి కాక కంపెనీల ద్వారా వస్తున్న వాతావరణ కాలుష్యం ఎన్నో అనారోగ్యాలతో అకాల చావులు సంభవిస్తున్నాయి. విశాఖపట్నానికి ఒక ప్రక్కన సముద్ర తీరం వుంటే, మరో ప్రక్కన తీవ్రమైన ప్రమాదం పొంచే వుందని ఎంతోమంది మేధావులు, పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ పర్యావరణం కలుషితం అవడంతో రోజురోజుకి క్యాన్సర్ మహమ్మారి బారినపడి మరణించేవారి సంఖ్య పెరుగుతుంది. ఫార్మా కంపెనీలు, స్టీల్ ప్లాంట్‌లలో నిత్యం కార్మికులు ప్రమాదాలకు గురికావడం, చనిపోవడం జరుగుతోంది. ఈ ప్రమాదాలకు ఇటు ప్రభుత్వాలు గానీ, అటు యాజమాన్యం గానీ ఏ మాత్రం బాధ్యత వహించకుండా, నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పరిస్థితే వుంది.

కరోనా కష్ట కాలంలో ఆర్.ఆర్.వెంకటాపురం, వెంకటాద్రినగర్‌లో నివసిస్తున్న ప్రజలు గ్యాస్ లీకేజీ మరిన్ని కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఎల్‌జీ పాలిమర్స్‌లో మరణించిన కుటుంబసభ్యులకు 'జనశక్తి' ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఈ ఘటన మన దేశంలోను, రాష్ట్రంలోను బహుళజాతి కంపెనీల నిర్లక్ష్యాన్ని, మన దేశ ప్రజల ఆరోగ్యాలను, శ్రమను, సంపదలను దోచుకువెళ్లే విధానాన్నీ బట్టబయలు చేస్తున్నది. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించి మన సంపదలను, ఆస్తులను, ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడటానికి సంసిద్ధులవుదాం.

ooo